
ప్రజాశక్తి
శనివారం 5 జూలై 2025



నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-పార్వతీపురం

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 20 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాట్లు చేసినట్లు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, , ఎక్సైజ్ కేసులు, భూమి తగాదా కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, మరియు ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు, ప్రజలు ఈ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగపరచుకోవాలని కోరారు.

విద్యార్థుల ప్రవేశాల తగ్గుదలపై శాస్త్రీయ విశ్లేషణ

తాటిపూడి నీటిపై ఆందోళన వద్దు : మంత్రి కొండపల్లి
విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకోవాలి : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు తగ్గుదలపై శాస్త్రీయంగా విశ్లేషణ చేయాలని ఎంఎస్ఎంఇ, సెర్ఫ్, ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు, నాణ్యమైన ఆహారం, మెరుగైన సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని, ప్రతి విద్యార్థిపైన ఏడాదికి సుమారు రూ.70వేల ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వివరించారు. ఆయినప్పటికీ నమోదు తగ్గడానికి గల కారణాలను విశ్లేషించి, తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

జెడ్‌పి సర్వ సభ్య సమావేశం ఛైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. విద్యాశాఖపై చర్చ నడుస్తుండగా జెడ్‌పి ఛైర్మన్ స్పందిస్తూ విద్యార్థుల నమోదు తగ్గడం ఆందోళన కలిగించే విషయమని, సంఖ్య తగ్గకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కోరారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 8వేల వరకు అడ్మిషన్లు తగ్గినప్పటికీ, ఆఫ్ లైన్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని కలిపినా నమోదు తగ్గితే, అందుకు గల కారణాలను గుర్తించాలని డిఇఒకు సూచించారు. తగ్గిన అడ్మిషన్లు, ప్రైవేటు స్కూల్స్‌కు వెళ్తున్నాయా? కుటుంబాల వలసల కారణంగా తగ్గుతుందా? ఇతర కారణాలమైనా ఉన్నాయా? అనే విషయాలను సర్వే చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం పథకం కింద మిగిలిన రూ.2వేలు పాఠశాలల ఖాతాల్లో జమచేశారా? అని ప్రశ్నించారు. దీనిపై విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందిస్తూ అడ్మిషన్స్‌పై స్పెషల్ డ్రైవ్ తీసుకోనున్నామని, ఐదేళ్ళు నిండిన ప్రతి ఒక్క బాల బాలిక ఏదో ఒక పాఠశాలలో ఉండేలా చూస్తున్నామని, బడి బయట పిల్లలు లేకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద మిగిలిన రూ.2వేలు స్కూల్ మానేజ్మెంట్ కమిటీల ఖాతాలలో జమ చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లు లేరని, సచివాలయాల నుండి డెప్యుటేషన్‌పై వేస్తే బాగుంటుందని కోరారు. ఎంఎల్‌సి రఘురాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ కృషి చేసారని, వారి ఆదేశాలతో ప్రైవేటు పాఠశాలల్లో కదలిక వచ్చిందని అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. డిగ్రీ కళాశాల కోసం ఒక భవనం వెంటనే అవసరం ఉందని, ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

తాటిపూడి జలాశయం నీటిని బొడ్డవరలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుకు తరలిస్తే సాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయంటూ తొలుత గంట్యాడ జెడ్‌పిటిసి, ఆ తరువాత ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు తగ్గ భరోసా సమావేశంలోనే ఇవ్వాలని కోరారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జిఒ వచ్చిందని, జిందాల్ సంస్థే స్వయంగా నీటిని సమకూర్చుకోవాలని, ప్రభుత్వం నీరందించాలని ఉంది కానీ తాటిపూడి నుండే అందించాలని స్పష్టంగా లేదని తెలిపారు. తాటిపూడి కేవలం రైతులకు నీరందించదానికే ఉద్దేశించిన జలాశయమన్నారు. దీనిపై మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ నీటికోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎంఎస్ఎంఇ పార్కుకు తాటిపూడి నుండి నీరందించడంపై ప్రభుత్వంలో ఇంకా చర్చించలేదని తెలిపారు. రైతులు కూడా అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని వివరించారు.

బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ ఏనుగుల దాడికి పంట పొలాలు పాడయ్యాయని, రైతుల బోరు బావులు, పైప్ లైన్లు దెబ్బ తిన్నాయని, వారికి పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో 2.26లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు తెలిపారు. దీనిపై పలువురు సభ్యులు స్పందిస్తూ అధికారులు మ్యుటేషన్ చేయకపోవడం, 1 బి, ఆధార్ తో లింక్ కాకపోవడం వంటి కారణాల వల్ల అన్నదాత సుఖీ భవ పథకం 40 శాతం మంది రైతులు లబ్ధిపొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారి వివరణ ఇస్తే విజయనగరం జిల్లాలో 20వేల మంది, పార్వతీపురం జిల్లాలో 7వేల మంది రైతుల ఖాతాలు ఇకెవైసి వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వెరిఫికేషన్‌లో అర్హులైన రైతుల పేర్లను జాబితాలో చేరుస్తామని ఇరు జిల్లాల అధికారులు వివరించారు.

చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని, రైతులకు సకాలంలో అందేలా చూడాలని కోరారు. మెడికల్ కళాశాల వద్దకు ఆసుపత్రిని తరలిస్తే ప్రజలకు దూరం అవుతుందని, అలాగే అటువైపు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా లేదని, కొన్ని విభాగాలను బోధనాసుపత్రి వద్ద ఏర్పాటు చేసి, పాత ఆసుపత్రినే అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండపల్లి తెలిపారు. కార్యక్రమంలో తొలుత అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ప్రభుత్వ విప్ తోయిక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల రవిచంద్ర, లోకం నాగమధవి, డిసిసిబి , డిసిఎంఎస్, కాపు కార్పొరేషన్ చైర్మన్‌లు కిమిడి నాగార్జున, గొంప కష్ణ, పాలవలస యశస్వి, ఇరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి


సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

అల్లూరి స్ఫూర్తితో
రాజ్యాంగ రక్షణకు కృషి చేయాలి
డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రామస్వామి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం వీరుడు, విప్లవ ధ్రువతార అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని కాపాడడమే నేటి యువతకు ముందున్న లక్ష్యమని, దీనికై యువతంతా కృషి చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సభ జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.రాజశేఖర్ అధ్యక్షతలో జరిగిన ఈ సభలో తొలుత నాయకులు ఎం.వెంకటరమణ, చింతాడ శివ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.అఖిల్, కె.రాజు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు పాలకుడిగా నిలిచిన ఏకైక మన్యం వీరుడు అల్లూరి అని, మన్యం ప్రజల హక్కులకై నిరంతరం పోరాడిన నిజమైన హీరోగా నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. తన పోరాటంలో భయంగాని, పక్షపాతం గాని చవిచూడని వ్యక్తిగా కీర్తి పొందారని తెలిపారు. నాడు అల్లూరి పోరాట ఫలితాలను నేడు ప్రభుత్వాలు తుంగలో తొక్కే ప్రయత్నాలు చేపడుతున్నాయని, నేటి రాజకీయాల్లో నిరుద్యోగుల రేటు దినదిన గండంగా పెరుగుతుందని, దీన్ని నిర్మూలించగలిగే శక్తి నేటి పాలక ప్రభుత్వాలు చేపట్టకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు విడుదల చేస్తానన్న ప్రభుత్వాలు నేడు ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టేందుకు అనేక మార్పులు చేపడుతున్నాయని విమర్శించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, సూత్రాలను కాల రాసేందుకు ఉన్మాదపు శక్తులు కృషి చేస్తున్నాయని, దీన్ని ఎదిరించిన వ్యక్తులను దేశద్రోహులుగా ముద్రించి, అనేక రూపాల్లో దాడులకు పూనుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు నేటి యువత ముందు వరుసలో ఉండి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె.జాన్ రాజు, నితిన్, వంశీ, ఎస్ఎఫ్ఐ నాయకులు డేవిడ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్ లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఆరిక గంగారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొమరాడ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు యువకులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన

పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె. రాజు మాట్లాడుతూ అల్లూరి పోరాటం స్ఫూర్తితో యువకులు, విద్యార్థులు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె. డేవిడ్, హెచ్. సింహాచలం జిల్లా కమిటీ సభ్యులు శివ, సంజీవ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో అధ్యయనం చేయాలి

పార్వతీపురం: అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి తో సమాజాన్ని యువత అధ్యయనం చేయాలని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు మాస్టారు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సభను గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన బై పాస్ రోడ్డు లో ని గిరిజన బాలుర కళాశాల వసతి గహం లో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు నాయుడు మాట్లాడుతూ గిరిజనులపై బ్రిటీష్ పాలకులు చేసిన దాడులు, దౌర్జన్యాలపై చైతన్యం నింపి సాయుధ పోరాటం నడిపి వారికి కంటి మీద కునుకు లేకుండా చేసిన గొప్ప వీరుడు అల్లూరి అని అన్నారు.

సీతంపేట: అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆదివాసీ సభ్యులు పూలమాల వేసి ఆయనకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ జయంతోత్సవాలో హెచ్.మోహన్‌రావు, జెఎసి సభ్యులు బిడ్డిక రామ్మోహ్మనరావు, చిరంజీవులు, చంటి, సాయికుమార్, నిమ్మక కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సన్నబియ్యం కావు... పురుగులు పట్టిన బియ్యం

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకానికి ప్రభుత్వం సన్న బియ్యం పేరుతో నాసిరకం (బియ్యం) బియ్యం పంపిణీ చేస్తుందని, ఈ బస్తాల్లో బియ్యం కన్నా సుంకు పురుగులు, తెల్ల పురుగులే ఎక్కువ కనిపిస్తున్నాయని సిపిఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సిపిఎం బృందం మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసిన బియ్యాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనానికి ఇచ్చే బియ్యం వంట నిర్వాహకులు కళ్ళల్లో వత్తులు పెట్టుకుని జాగ్రత్తగా శుభ్రం చేసినా పురుగులు ఉంటున్నాయని, ఇలా ఉంటే పిల్లలకు ఎలా వండి పెట్టగలమని మధ్యాహ్న భోజన నిర్వాహకులు సిపిఎం బృందానికి తమ గోడును వెల్లబుచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పాఠశాలకు బియ్యం పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని, మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యతా లోపం వల్ల జరిగే అనర్థాలకు హైస్కూల్ హెచ్ఎంను, నిర్వాహకులను బలి పశువులుగా చేయొద్దని డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ విషయంపై హెచ్ఎంను అడగ్గా సిఎస్‌డిటికి ఫిర్యాదు చేసి అనంతరం కొత్త బియ్యం, పాత బియ్యం ఒకే గదిలో నిల్వ ఉండడం వల్ల పాత బియ్యం పురుగులు కొత్త బియ్యానికి వ్యాప్తి చెందాయని అన్నారు. అలాగే బియ్యం నిల్వలపై లిఖిత పూర్వకం వినతిని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రాయిపల్లి రాము, ఏళ్ల ఈశ్వరరావు లు తెలిపారు.

సన్న బియ్యంలో పురుగులు


మధ్యాహ్న భోజనానికి సరఫరా చేసిన బియ్యంలో పురుగులు

వీరఘట్టం: మధ్యాహ్నం భోజనం పథకానికి పంపిణీ చేసిన సన్నబియ్యంలో పురుగులు దర్శనమిచ్చాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు నర్సిపురం, గోర మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రతి రోజు వలే శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు నిర్వాహకులు సంచిలో నుంచి సన్న బియ్యం తీసి చేటలో వేయగా పురుగులు దర్శనమివ్వడంతో వాటిని శుభ్రం చేయలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ ఎ.సాయికామేశ్వరరావు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా పురుగులు పట్టిన సన్నబియ్యాన్ని మారుస్తామని, ఈ పాఠశాలలే కాకుండా ఇంకెక్కడైనా ఇలా ఉన్నట్లు తన దృష్టికి తీసుకొస్తే సన్నబియ్యాన్ని మారుస్తామని తెలిపారు.

మహిళా ఉద్యమనేత మానికొండ

ప్రజాశక్తి - పార్వతీపురం

మహిళా ఉద్యమంలో సూర్యావతి గణనీయమైన పాత్ర పోషించారని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఐద్వా నేత మానికొండ సూర్యావతి 32వ వర్ధంతి ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివేకానంద కాలనీలో ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కమ్యూనిస్టు మహిళ ఉద్యమ నేపథ్యంలోనే కీర్తి పొందారన్నారు. 13 ఏళ్లకే స్వాతంత్రోద్యమంలోనూ, ఆ తర్వాత వామపక్ష భావాల వైపు ఆకర్షింపబడి జీవితం సర్వస్వం పీడిత ప్రజల విముక్తికి అలుపెరగని కృషి చేశారని అన్నారు. ఆమె అడుగుజాడల్లో నిబద్ధతతో కృషి చేయడమే మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళిలని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జి.తులసి, మాన్యం గౌరీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మహిళా హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి ఐద్వాకు తొలి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి మానికొండ సూర్యావతి అని స్థానిక ఐద్వా నాయకులు టి.ఇందు, జె.స్వప్న అన్నారు. సూర్యావతి 32వ వర్ధంతి సభ పట్టణంలో ఐద్వా నివాళి కార్యక్రమం శుక్రవారం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ సూర్యావతి భూస్వామ్య కుటుంబంలో పుట్టి అట్టడుగు మహిళల హక్కుల కోసం పనిచేశారని, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలపై అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. ఎమ్మెల్యేగా కూడా పనిచేసిన సూర్యావతి మహిళల హక్కులపై చట్టసభల్లో వాణి వినిపించారని, నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు మహిళల హక్కుల కోసం మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉందని అన్నారు. కావున కఠినంగా వ్యవహరించాలని, మహిళా చట్టాలు కఠినంగా అమలు చేసి రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఐద్వా ఆధ్వర్యంలో భవిష్యత్తులో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీత, లక్ష్మి, సరోజిని, మంగమ్మ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


సూర్యావతి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

జ్వరాల బారిన హాస్టల్ విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని వ్యాధులు ప్రబలుతున్నాయి. ఎక్కడికక్కడే జ్వరపీడతుల సంఖ్య పెరుగుతుంది. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతంలో కూడా జ్వరాలతో బాధపడుతున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు ప్రైవేట్ హాస్పటళ్లు కూడా రోగులతో కిటకటలాడుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో గల ఎస్టీ బాలురు వసతిగృహంలో విద్యార్థులు గత వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరాలు తీవ్రతంగా ఉండడంతో గత రెండు రోజుల నుంచి స్థానిక ప్రగతి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరిక సిద్ధార్థ, ఆరిక నాని, ఆరిక టైగరేష, బిడ్డిక బాలేషు, వెంకటేష్, ప్రేమ్, కె.జగన్, బిడ్డిక అనిల్ తదితరులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఇందులో జగన్, అనిల్‌తో పాటు మరి కొంతమందికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారించారు. వసతి గృహంలో పారిశుధ్య లోపం వల్ల విద్యార్థులకు జ్వరాల సోకుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారి యంత్రాంగం దృష్టి పెట్టాల్సి అవసరం ఉంది.


ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి-మక్కువ

ఏడాదికాలంగా వ్యవసాయ పంపుసెట్ల మంజూరుపై వచ్చిన ఫిర్యాదులు మేరకు విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ సిఐ కృష్ణ ఆధ్వర్యంలో విజిలెన్స్ సిబ్బంది కవిరిపల్లి, మార్కొండ పుట్టి, దెబ్బగడ్డ, కోన, బట్టి వలస తదితర గ్రామాలలో విచారణ చేపట్టారు. విచారణకు సంబంధించి అవకతవకలు ఏమీ లేనట్లు సిఐ తెలిపారు. ఇదిలా ఉండగా ముందస్తుగా ఆయా విద్యుత్ శాఖ ఎనర్జీ అసిస్టెంట్ ల ద్వారా రైతుల సమాచారం విజిలెన్స్ అధికారులు సేకరించడంతో ఏ విధమైన అక్రమాలు దొరికే ఆస్కారం లేకుండా సిబ్బంది రైతులు ద్వారా దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

మొద్దు నిద్ర వీడి చర్చలు జరపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

హైయర్ బస్సు యజమానులు డ్రైవర్లతో చర్చలు జరపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం హైర్ బస్ డ్రైవర్ల నిరసన దీక్ష నాలుగో రోజుకు చేరింది. నల్ల బ్యాడ్జీలతో హాజరై డిపో గేటు వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి హైయర్ బస్సు డ్రైవర్లు, కాంట్రాక్టువర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.వి చారి, కార్యదర్శి పిడిప్రసాద్, కోశాధికారి అశోకు, ప్రసాదు, రెడ్డి వేణు, గొర్లె వెంకటరమ మాట్లాడుతూ అద్దె బస్సు యజమానులు, ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా బస్సు యజమాని సురేంద్ర రెడ్డి కవ్వింపు చర్యలకు పాల్పడం, భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని కార్మికులు హెచ్చరించారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు బస్సు యజమానులను చర్చలకు పిలవాలని, లేనిచో ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె, ఆందోళన ఉధృతం చేస్తావని హెచ్చరించారు.

పొగాకు ప్రాణాంతకం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే దుష్ప్రభాలపై అవగాహన పెంచి భవిష్యత్ తరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పేర్కొన్నారు. పొగాకు వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా చర్చివీధి డివిఎం ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వల్ల అనారోగ్య సమస్యలను సూచించే పోస్టర్లను ప్రదర్శించి విద్యార్థులచే చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడి, చుట్ట, ఖైనీ,గుట్కా వినియోగం ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగిస్తుందని ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్ మహమ్మారికి కారణభూతమవుతుందని తెలిపారు. కావున వీరిటికి దూరంగా ఉండాలని సూచించారు. వీటిపై వైద్య సిబ్బంది, పలు శాఖల సమన్వయంతో జూలై 21 వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం అందరిచే పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.శ్రీధర్, ఎన్‌టిసిపి కౌన్సిలర్ కె.భవాని, డిప్యూటీ డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, పిఇటి అశోక్ నాయుడు, వైద్య సిబ్బంది ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మ్యుటేషన్లు త్వరగా పరిష్కరించాలి : పిఒ

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రామసభల్లో వచ్చిన మ్యూటేషన్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. మండలంలోని మోసూరులో రెవెన్యూ సమస్యలపై శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు పిఒ హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. భూ సవరణలకు సంబంధించి మ్యుటేషన్ కొరకు పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. గ్రామంలో ప్రైవేటు భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరులు, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయాలని అన్నారు. తద్వారా రైతులకు భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని అన్నారు. రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కగా నిర్వహించాలన్నారు. మృతి చెందిన రైతుల మ్యూటేషన్లు, న్యాయపరంగా ఎటువంటి సమస్యలు లేని భూములకు చెందిన మ్యూటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామసభల్లో వచ్చిన సమస్యలను ఆయా విఆర్ఒల లాగిన్లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. ప్రత్యేక భూ కేసులకు సంబంధించి శిక్షణ ఇచ్చి వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న పిఒ అశుతోష్‌శ్రీవాస్తవ

అంధకారంలో గాయత్రి నగర్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల గాయత్రి నగర్ కాలనీలో అంధకారం అలముకుంది. గత పది రోజుల నుంచి వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో విష సర్పాలు భయం కూడా వెంటాడుతోంది. పిల్లలు స్టడీ అవర్స్ పూర్తి చేసుకుని రాత్రి ఇంటికి వచ్చేసరికి పూర్తిగా చీకటి అలుముకోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు


రోడ్డుపై ఉన్న నీటిని పక్కకు మళ్లిస్తున్న రైతులు

పాలకుల కన్నా రైతులే మిన్న...!
రోడ్డుపై ఉన్న వర్షపు నీరు దారి మళ్లింపు

ప్రజాశక్తి కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి రోజురోజుకూ అధ్వానంగా మారుతుంది. ముఖ్యంగా రోడ్డు మరమ్మతులకు గురికావడానికి ప్రధాన కారణం వర్షపునీరు రహదారిపై నిల్వ ఉండడమేనని అధికారులకు తెలిసినా పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రతిరోజూ ప్రయాణికులు రోడ్డు గోతుల్లో దిగిపోయి గాయాల పాలవుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఆఖరుకు ఉైతన్నలే స్వచ్ఛందంగా అవకాశం న్న చోట రోడ్డుపై ఉన్న వర్షపు నీటిని దారిమళ్లిస్తున్నారు. శుక్రవారం అర్తం గ్రామ సమీపంలో రోడ్డుపై ఉన్న వర్షపు నీటిని రైతులు బి.త్రినాథ, కె. గంగరాజు, కె.తమ్మినాయుడు దారి మళ్లించారు. ఇది చూసి రోడ్డుపై వెళ్తున్న ప్రజలు, వాహనదారులు రైతులు చేసిన పనికి అభినందించారు. వాహనదారులు లక్షలాది రూపాయలు పన్నులు కడుతున్నా రోడ్లు బాగు చేయడానికి ప్రభుత్వాన్ని దగ్గర నిధుల్లేవా అంటూ చర్చించుకుంటున్నారు.

నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మోసం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం నిలువునా మోసగించిందని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం స్థానిక పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఇంతవరకు జాబ్ కేలండర్ విడుదల చేయలేదని చెప్పారు. రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఎల్విన్‌పేటలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట చెక్‌పోస్ట్ వద్ద సిఐ బి.హరి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహన తలిఖీలు చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, ఒడిశా గుణుపూర్, రామన్నగూడ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి వాహనదారుడు అన్ని వాహన పత్రాలు కలిగి ఉండాలని, అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.


కన్నపుదొరవలసలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కన్నపుదొరవలసలో టిడిపి తొలి అడుగు

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం కన్నపు దొరవలసలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలన, సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజల నుంచి నేరుగా తెలుసుకున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరపాడులో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గోరపాడులో గత మూడు రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో చుట్టుపక్క గ్రామాల గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎవరిపై విరుచుకుపడతాయోనని క్షణక్షణం బిక్కుబిక్కుమంటున్నారు.

15 తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని కొలకోటి వీధిలో శుక్రవారం కోట దేవి ఇంట్లో చోరీ జరిగింది. కోట దేవి కుటుంబంతో కలిసి ఒడిశా లోని గుప్తేశ్వరం తీర్ధయాత్రకు ఈనెల 2న వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో బీరువాలు తెరిచి ఉండడం గమనించారు..15 తులాల బంగారం, వెండి సామాగ్రి చోరీకి గురయ్యాయని ఆమె టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీంతో క్లూస్ టీం రంగంలోకి దిగి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి మండల అధ్యక్షులుగా పరమేష్

ప్రజాశక్తి - సాలూరురూరల్



వివాదరహితుడు, పార్టీ కోసం కష్టపడే యువకుడు ఆముదాల పరమేశ్‌ను టిడిపి అధిష్టానం రెండో మండల టిడిపి అధ్యక్షునిగా నియమించింది. పరమేష్ 2021 నుంచి మండల పార్టీ అధ్యక్షునిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి మండలంలో పార్టీకి మంచి ఊపు తీసుకొచ్చారు. మంత్రి సంధ్యారాణి పరమేష్ పట్ల నమ్మకంతో పార్టీ పగ్గాలు కట్టబెట్టారు. ఆయన ఎంపిక పట్ల సాలూరు మండల టిడిపి సీనియర్ నాయకులు బూస తవుడు, మత్స శ్యామ్ సుందర్, రామన్న దొర, తాడుతూరి తిరుపతిరావు, తురాయిల సత్యం, క్రిబుగత భాస్కరరావు, రొంపల్లి వెంకటేష్, కోట లక్ష్మణ్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం : వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సర్పంచి, వైసిపి జిల్లా విద్యా విభాగం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు కోరారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో సరిపడే స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పక్కనే నిర్మాణంలో ఉన్న "నాడు-నేడు" భవనం త్వరితగతిన పూర్తయితే, తాత్కాలిక ఇబ్బందులు తగ్గిపోతాయన్నారు. విద్యార్థులు అనారోగ్య బారిన పడుతున్నారని ఆరోగ్య కార్యకర్తల నియమించాలని అన్నారు.

పాఠశాలల వర్గీకరణ చట్ట వ్యతిరేకం

ప్రజాశక్తి - కురుపాం

పాఠశాలలను తొమ్మిది రకాలుగా వర్గీకరించడం విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకమని ఎపిటిఎఫ్ ఉమ్మడి జిల్లాల గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక శివన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ పదోన్నతులు, బదిలీలు, పాఠశాల వర్గీకరణ తప్పుల తడకలు అని అన్నారు. కొత్తగా సృష్టించబడిన 4693 పిఎస్ హెడ్మాస్టర్ పోస్టుల్లో 30శాతం, డిఎస్సీకి 70శాతం పదోన్నతుల ద్వారా నింపాలి. ఆ సర్వీసు నిబంధనను పాటించకపోవడం వల్ల 1998, 2000 డీఎస్సీల ద్వారా నియమించబడిన ఎస్జీటీలకు పదోన్నతి లేకపోవడం వల్ల వారికి తీవ్రంగా నష్టం జరిగిం దన్నారు. వీరికి పదోన్నతులు ఇచ్చే సెకండరీ గ్రేడ్ టీచర్లు ముఖ్యంగా మహిళలు గుమ్మ లక్ష్మీపురం, కురుపాం, సాలూరు, కొమరాడ మండలాల్లోని కొండలు పట్టేవారు కాదని, వేలాది పిఎస్ హెడ్మాస్టర్ పోస్టులను వివిధ సబ్జెక్టులకు చెందిన స్కూల్ అసిస్టెంట్ల ద్వారా నింపడం ఘోరమైన తప్పిదమనిని అన్నారు.

అల్లూరి స్ఫూర్తి యువతకు మార్గదర్శకం : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం


సీతారామరాజు చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న జెసి శోబిక

అల్లూరి సీతారామరాజు త్యాగం, పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకమని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో నిస్వార్ధంగా పోరాడిన గొప్ప సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన చూపిన వీరత్వం, త్యాగం అందరికీ ఆదర్శమని ప్రసంసించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, ఇతర అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కురుపాం : అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఐటిడిఎ ఆధ్వర్యంలో

స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో అల్లూరి జయంతి వేడుకలు జరిగాయి. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటిడిఎ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అల్లూరి దేశానికి చేసిన సేవ ఎనలేనిదని, ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి అన్నదొర, ఎపిఒ జి.చిన్నబాబు, ఎఒ సునీల్, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, ఎఎంఒ కోటిబాబు, ఎపిడి శ్రీహరిరావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్ ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ పూలమాల లేసి నివాళులర్పించి.అనంతరం విద్యార్థులకు స్వతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గేయ రచయిత మళ్లిపురం జగదీష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీరాములు , సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ కాలంలో పోరాడిన మహానాయకుడు అల్లూరి సీతారామరాజు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవి నాయుడు సమక్షంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవ నాయుడు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


సీతారామరాజుకు నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

మహోజ్వల శక్తి అల్లూరి : ఎస్‌పి

పార్వతీపురం టౌన్ : విప్లవ జ్యోతి,మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకొని, జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ... అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర చరిత్ర లో ఒక మహెూజ్వల శక్తి అని పేర్కొన్నారు. ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఆర్ఐ నాయుడు, రాంబాబు , ఎఎఒ సతీష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బలోవ రాజు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించారు. ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకష్టారావు విద్యార్థులు పాల్గొన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారి కృష్ణ మోహన్ మాట్లాడుతూ త్యాగధనుల కోసం తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో కె.మల్లేసు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

ప్రజాశక్తి - పాలకొండ

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమదోపిడీని దోచుకొనేలా చట్టాలను మారుస్తున్నారని ఇది ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి దేశంలో ప్రభుత్వ ఆస్తులన్నీ ఆదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో రైస్ మిల్ ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మె కరపత్రం ఆవిష్కరించారు కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, వై.సింహాలు, చల్ల స్వామినాయుడు, ఎం.వెంకటరమణ ,అధ్యక్షులు జాగా గోవిందరావు, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా స్థానిక వైద్యాధికారి అరుణ్‌కుమార్‌కు ఆశా వర్కర్ల సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ, సాంబమూర్తి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న లేబర్ కోట్లు రద్దు చేయాలని,కార్మికులకు రక్షణ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.


ఎంఇఒ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేసిన మధ్యాహ్న భోజన నిర్వహకులు, స్కూల్ స్వీపర్లు

పార్వతీపురంటౌన్ : సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వహకుల సంఘం నాయకులు జులై 9న జరగబోవు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు సమ్మె నోటీసును ఎంఇఒకు వై.విజయ్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మధ్యాహ్న భోజన నిర్వహణ సంఘం అధ్యక్షులు జి.తులసి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక కర్షక సార్వత్రిక సమ్మెలో మన్యం జిల్లాలోని వివిధ మండలాల మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్స్ స్వీపర్లు పాల్గొంటారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్నం భోజన నిర్వహణ నిమిత్తం విద్యార్థులకు చెల్లిస్తున్న మెనూ ఛార్జీలు పెంచాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, బి.లక్ష్మి, జి.కృష్ణ, మధ్యాహ్న భోజన నిర్వహకుల సంఘం, పాఠశాలల స్వీపర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

40 ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలిచ్చి గిరిజనులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాలెం పంచాయితీ కుంభకోట, కర్లగండ చెందిన సుమారు 30 మంది గిరిజన రైతులు 40 ఏళ్లుగా కొండపై వివిధ పంటలు వేసుకొని జీవిస్తున్నారని అన్నారు. ఈ కొండపోడు సాగు చేస్తున్న ప్రాంతంలో వారికి నేటి వరకు పట్టాల్విలేదన్నారు. పట్టాలివ్వాలని కోరుతూ పలుమార్లు తహశీల్దార్‌కు, కలెక్టరేట్‌కు దరఖాస్తు చేసుకున్నా నేటికీ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అన్నదాత సుఖీభవ, బ్యాంకు రుణాలు పొందలేక చాలా నష్ట పోతున్నా మన్నారు. కావున ఈ కొండ భూమి ప్రాంతాన్ని సర్వే చేసి తమకు పట్టాలి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కుంభకోట, కర్లగండ గిరిజన రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించరా? : చైర్‌పర్సన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ చైర్పర్సన్ అంటే లెక్క లేదా, కనీసం ప్రోటోకాల్ పాటించాలనే సంస్కారం కూడా లేదా అని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లును నిలదీశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్పర్సన్ కొండపల్లి రుక్మిణి, పలువురు కౌన్సిల్ సభ్యులతో వచ్చి కమిషనర్‌తో మాట్లాడారు. గురువారం మున్సిపల్ పరిధిలో గల 4, 29 వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి తనకు, ఆయా వార్డు కౌన్సిలర్లు తెలియచేయకుండా చేయడమేమిటిని, అభివృద్ధికి మాటలు కాదని, కనీసం చైర్‌పర్సన్, కౌన్సిలర్లను పిలవాలనే ఆలోచన లేకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ అప్పటికప్పుడే నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఇకపై అలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎడ్ల త్రినాధ, చీకటి అనురాధ, సువ్వాడ లావణ్య, బోడయ్య, వైసీపీ నాయకులు బోను ఆదినారాయణ, నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా ఉండండి

ప్రజాశక్తి - పాలకొండ

కార్యకర్తలు సమిష్టిగా ఉండాలని టిడిపి అరకు నియోజకవర్గ పరిశీలకులు హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం రమా సత్యనారాయణ కల్యాణ మండపంలో మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ కార్యకర్తలు బలంగా ఉన్నారని, నాయకుల్లోని ఐక్యత లేదని, ఇకపై పార్టీ బలోపేతానికి అంతా ఐక్యంగా పని చేయాలన్నారు. పాలకొండ నియోజకవర్గం టిడిపికి కంచుకోటని తెలిపారు. వైసిపికి ఇక్కడ చోటు లేకుండా చేయాలన్నారు. డిసిసిబి చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు సువ్వాల సూర్యనారాయణ మాట్లాడుతూ తనకు పార్టీ గురుతుల బాధ్యత అప్పజెప్పిందన్నారు. పార్టీకి కష్టపడిన ప్రతి ఒక్కర్నీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. అందుకు తానే నిదర్శనమన్నారు. నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గెలుపును ఎంతగానో తాము కృషి చేశామన్నారు. అయితే జనసేన ఎమ్మెల్యే కావడంతో టిడిపి బలోపేతానికి మనమంతా కష్టపడి పనిచేయాలన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు మాట్లాడుతూ ఎస్‌టి నియోజకవర్గమైనప్పటికీ ఇక్కడ బిసిలు అధికంగా ఉన్నారని, బిసిలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి పదవులు కొట్టబెట్టాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు మాట్లాడుతూ తనకు పార్టీ వల్ల గుర్తింపు వచ్చిందని, అయితే ఇటీవల వైసిపి నుంచి తనపై కొంతమంది కూటమిలోకి తెచ్చి వేధిస్తున్నారన్నారు. తనకు తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి, కురుపాం నియోజకవర్గ పరిశీలకులు పదవి లేకపోయినా ఫర్వాలేదని, మండల పార్టీ అధ్యక్షుడు పదవి తనకి ఉంచితే పార్టీకి కష్టపడి పని చేస్తాను అన్నారు. సమావేశంలో అరకు పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, మండల నాయకులు జాడ శ్రీధర్, స్వర్ణరాణి, వి.రమణమూర్తి, కిమిడి కాశీనాయుడు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జలో గల విజయరామ ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్ దుకాణణాన్ని మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పురుగు మందుల నమూనా సేకరించి పరీక్షల నిమిత్తం లాబ్‌కు పంపారు. అనంతరం సీతానగరంలో గల మన గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మండలంలో గల 20 రైతు సేవా కేంద్రాల నుంచి ఇప్పటి వరకు యూరియా 204 మెట్రిక్ టన్నులు, డిఎపి 149 మెట్రిక్ టన్నులు ఎరువులు సప్లయ్ చేశామన్నారు. ఎరువుల ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, అందులో స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం పరజపాడు, రావాడ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండమని, ఏ అవసరమైన తనను సంప్రదించాలని భరోసా ఇచ్చి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శశికళ, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - కొమరాడ

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. శుక్రవారం చొళ్లపదం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రజలు వివిధ అవసరాల కోసం సచివాలయాలకు వస్తుంటారు కాబట్టి ఉద్యోగులంతా అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం డిఎ జుగాపై సమీక్షించారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ సెంటర్‌ను, హెల్త్ సబ్ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఫ్రీ స్కూల్ పిల్లలకు అందుతున్న విద్యపై ఆరా తీశారు. ఆరోగ్య జాగ్రత్తలపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అనారోగ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, కావున రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపిపి బి ప్రమీల వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మండలంలో రైతులందరికీ అవసరమైన ఎరువులు అందిస్తామని, కొరత రానీయకుండా ఎరువులు అందిస్తామని ఆయన సభ్యులకు తెలిపారు. అలాగే ఏజెన్సీ మైదాన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పాచిపెంట, గురువు నాయుడుపేట వైద్యాధికారులను సభ్యులు కోరారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడతామని పాచిపెంట వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సభ్యులకు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ మాట్లాడుతూ ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల తాగునీరు కలుషితం కాకుండా ఉన్న తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందేలా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆయన కోరారు అలాగే పలు శాఖల అధికారులు శాఖాపరమైన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, వైస్ ఎంపిపిలు కె.రవీంద్ర, ఎం.నారాయణ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

తడి, పొడి చెత్తను వేరుగా ఉంచాలి

ప్రజాశక్తి - సీతానగరం

తడి, పొడి చెత్తలను వేరు చేయాలని డిపిఒ టి.కొండలరావు అన్నారు. మండలంలోని లచ్చయ్యపేటను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు సేకరిస్తున్న తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి డంపింగ్ యార్డ్‌లో వాటిని ఆర్థిక వనరుగా మార్చాలన్నారు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి వాటిని ముందుగా బుట్టల్లో వేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పరిశుభ్రతను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్, గ్రామపెద్దలు ప్రజలు పాల్గొన్నారు.


స్థానికులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న డిపిఒ కొండలరావు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సీతంపేట : వర్షాకాలం అందులో ఎపిడిమిక్ సీజన్ కావడంతో ఎక్కడ చూసినా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్ ఎ.కళావతి, కార్యదర్శి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. దగ్గరుండి కాలువలో కూడికలు చేయించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తికొండ కాలువలో మురికి నీరు స్తంభించకుండా వెళ్లడానికి పూడికలు తీయిస్తున్నామని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నామని, చెత్తను బయట వేయకుండా వాహనాల్లో వేయాలని తెలిపారు. తడి, పొడి చెత్త వేరు చేయాన్నారు.


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగెలు

ప్రమాదం జరిగితే గాని స్పందించరా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రమాదం జరిగితే గాని స్పందించాలని మున్సిపల్ పరిధిలో గల ఐదో వార్డులోని నివాస గృహాల ప్రజలు మున్సిపల్ అధికారులను బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పట్టణంలో ఐదో వార్డు పరిధిలో ఉన్న అమ్మిగారి కోనేరు గట్టు వీధిలో ఉన్న చెట్లపై విద్యుత్ వైర్లు కలిసిపోయి చాలా ప్రమాదకరంగా కనబడుతున్నాయి. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశమున్నందున విద్యుత్ వైర్లు చెట్లపై పడడంతో నివాస గృహాలు స్థానికుల విద్యుత్ షాక్ తగిలి ప్రమాదల బారినపడి మరణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు చెట్లపై ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని, చెట్ల కొమ్మలను తొలగించాలని, సమస్యను పరిష్కరించాలని అ వార్డు స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

సొంత డబ్బుతో పాఠశాల నిర్మాణం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని తోణాం పంచాయతీ మెట్టవలస లో గిరిజనులు సొంత డబ్బుతో ప్రాథమిక పాఠశాలను నిర్మించుకున్నారు. గ్రామంలోని నిరుపేద గిరిజనుల నుంచి ఉద్యోగుల వరకు తలా కొంత సొమ్ము ఎత్తుకుని సుమారు రూ.4లక్షతో శ్రమదానం చేసి నిర్మించారు. 2023 వరకు గ్రామంలో ఆర్‌సిఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఉండేది .అదే సంవత్సరంలో పాఠశాలను తాము నడపలేమని ఆర్‌సిఎం సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో ఆ గ్రామంలో పాఠశాల లేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని సర్పంచ్ మువ్వల ఆదియ్య నాయకత్వంలో గ్రామపెద్దలు అప్పటి మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరను కలిసి వివరించారు. వెంటనే ఆయన అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి విషయం తీసుకెళ్ళి ఎయిడెడ్ పాఠశాల స్థానంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయించారు. వెంటనే జిల్లా మైన్స్ నిధి నుంచి రూ.16లక్షలు మంజూరు చేయించారు. కానీ అప్పటికే ఎన్నికల కోడ్ రావడంతో పాఠశాల నిర్మాణపనులు ప్రారంభం కాలేదు. దీంతో స్థానిక గిరిజనులు సొంత డబ్బుతో రేకుల షెడ్ నిర్మించారు. 70మంది విద్యార్థులు న్న పాఠశాలలో ఐదు తరగతులకు నలుగురు ఉపాధ్యాయులు వున్నారు.ఎ ాఠశాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించారు.